నేడు ఆర్‌టిఐ 20వ వారోత్సవ వేడుకలు

- విజేతలకు బహుమతులు అందజేయనున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) 20వ వారోత్సవ వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్నాయి. ఆర్టీఐ 2025 విజేతలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ బహుమతులు అందజేయనున్నారు. జనగామ, కామారెడ్డి, మెదక్, నిర్మల్, వనపర్తి, వరంగల్, జోగులాంబ గద్వాల్, వికారాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్ మొదలైన జిల్లాల్లో సమాచార కమిషన్ ఈ ఏడాది అవగాహనా సదస్సులు నిర్వహించింది. గత పదకొండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను సైతం పరిష్కరించింది. ఈ క్రమంలో తెలంగాణ సమాచార హక్కుచట్టం వార్షికోత్సవాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సిఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. "తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది ఏడు లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు మొక్కజొన్న నిల్వలతో నిండిపోయాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో రైతుల శ్రమను దళారులు దోచుకుంటున్నారు. క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధరతో పాటు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెల్లిస్తామన్న రూ.330 బోనస్‌ను రైతులకు అందించడంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. క్వింటాల్‌కు రూ.1,600కే రైతుల నుంచి ప్రయివేట్ వ్యాపారులు కొంటున్నారు. ఫలితంగా రైతులకు తీవ్రంగా నష్టపోతున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులకు మద్దతు ధర అందించాలి" అని లేఖలో కోరారు.

షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ల ప్రక్రియ

- పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిసి రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ వాయిదా పడిన అనంతరం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. గురువారం ఉదయం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు.బిసి రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దాదాపు 90 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కుల సర్వే జరిగిందని, బిసిల నోటి ముద్దను భాజపా లాగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బిసిల బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తుచేశారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

నేడు తొలివిడత నోటిఫికేషన్

- మోగిన ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల నగారా
- మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ
- 23న పోలింగ్
- నేడు కోర్టు ఏం చెబుతుందనే దానిపై ఉత్కంఠ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపిటిసి), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల(జడ్‌పిటిసి) తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ గురువారం జారీ కానున్నది. తొలి విడతతో 53 రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 292 జడ్‌పిటిసి, 2963 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. నోటిఫికేషన్ అయితే విడుదల కాబోతున్నది కానీ ఎన్నిక ప్రక్రియ సజావుగా ముందుకు సాగుతుందా? లేదా? అన్నదే ధర్మసందేహం. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల జీవోపై రోజురోజుకీ పిటిషన్లు పెరిగిపోతుండటం, 2011 లెక్కల ప్రకారం కాకుండా 2024 కులగణన సర్వే డేటా ప్రకారం తమకూ ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు పెంచాలని పిటిషన్లు దాఖలు కావడం వంటి తాజా పరిణామాలతో హైకోర్టు తీర్పు మరింత ఆలస్యమయ్యే అవకాశముందనే చర్చ నడుస్తున్నది. ఓవైపు హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ, మరోవైపు నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో రాష్ట్రంలో అసలేం జరుగుతుందనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 రూల్ 5 ప్రకారం ఎంపీపీ, జెడ్పీల వారీగా రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. గురువారం(09.10.25) ఉదయం 10 :30 గంటల నుంచి శనివారం (11.10.25) సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారు. ఈ నెల 12న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు అర్హత నామినేషన్లను ధ్రువీకరించి ప్రాథమిక జాబితా విడుదల చేస్తారు. అనర్హతకు గురైన వారి నామినేషన్లపై అప్పీళ్లను 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తారు. 14న వాటిని మరోసారి పరిశీలిస్తారు. ఈ నెల 15 మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. ఈ నెల 23న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ఉంటుంది. ఐదు గంటల వరకు లైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. టెక్నికల్, రాజకీయ, ఇతరత్రా కారణాల వల్ల అనివార్యంగా పోలింగ్ ఆగిపోయినా, పోలింగ్‌పై అభ్యంతరాలు వ్యక్తమైనా ఎంపిటిసి, జడ్‌పిటిసి స్థానాల వారీగా రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలించి రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటుంది. నవంబర్ 11వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. అదే రోజు ఎన్నికల అధికారులు విజేతలను ప్రకటిస్తారు.

తొలి విడత నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోయినా అసలు ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతుందా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. గురువారం వాదనల తర్వాత తీర్పు రిజర్వులో పెడుతుందా? వెలువరిస్తుందా? విచారణ మళ్లీ వాయిదా వేస్తుందా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కోర్టు తీర్పువైపే అన్ని రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. మరోవైపు ఏవిధంగా ముందుకెళ్లాలి? కోర్టులో ఎలాంటి వాదనలు చేయాలనే అంశంపై న్యాయనిపుణులతో ఇటు రాష్ట్ర ప్రభుత్వం చర్చిస్తున్నది. రెండు రోజులుగా బిసి సామాజిక తరగతికి చెందిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ ఎమ్మెల్యేలు, నేతలు ఇదే అంశంపై మేధోమథనం జరుపుతున్నారు. మరోవైపు కోర్టు తీర్పు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వస్తే ఎలా ముందుకెళ్లాలనే దానిపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు కూడా న్యాయనిపుణులతో చర్చలు జరుపుతున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు జిఒపై వ్యతిరేకంగా కొందరు, ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించాలని మరికొందరు ఇలా 25 మందికిపైగా ఇంప్లీడ్ అయ్యారు. ఇంకోవైపు 2011 లెక్కల ప్రకారం కాకుండా 2024 కులగణన సర్వే ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు కేటాయించాలనే పిటిషన్‌లు కూడా దాఖలయ్యాయి. కులగణన సర్వే సమగ్రంగా జరిగిందనీ, దాని ప్రకారమే రిజర్వేషన్లు కేటాయించడం జరిగిందనీ సంఘ్వీ రాష్ట్ర ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపిస్తూనే ప్రతి ఒక్కరి వాదనలు వినాలని కోరడాన్ని బట్టి చూస్తే తీర్పు మరింత అలస్యమయ్యే అవకాశముంది. 42 శాతం బిసి రిజర్వేషన్ల జిఒను కొట్టేస్తే పరిస్థితేంటి? పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు ప్రభుత్వం వెళుతుందా? కోర్టులో విచారణ జరుగుతుండగానే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందా? మహారాష్ట్రలో మాదిరిగా ఫలితాలు వచ్చాక ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పునిస్తే మా సంగతేంటి? పెద్ద ఎత్తున డబ్బులు పెట్టి నష్టపోతే? మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాల్సి వస్తే ఆర్థిక భారం భరించగలుగుతామా? అనే సవాలక్ష ధర్మ సందేహాలతో ఆశావాహ అభ్యర్థులు సందిగ్ధంలో పడ్డారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకెళుతుంది? హైకోర్టు ఏం చెబుతుంది? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఇంటర్ గెస్ట్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ గెస్ట్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా వికారాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ గెస్ట్ లెక్చరర్‌కు 9 నెలల పెండింగ్ వేతనాలు బాకీ పడ్డారని తెలిపారు.

జీతాలు ఇవ్వక, ఉద్యోగాలు మానేసే పరిస్థితి వారికి కల్పించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి పెండింగ్‌లో పెడితే వారి కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కళాశాలకు వెళ్లకూడదని వారు నిర్ణయించుకున్నట్టు తెలిపారు. లెక్చరర్లు కాలేజీలకు రాకుంటే విద్యార్థులకు పాఠాలు ఎవరు చెబుతారు? సిలబస్ ను ఎవరు పూర్తి చేస్తారు? అని ప్రశ్నించారు. సర్కారు నిర్లక్ష్యంతో లెక్చరర్లతో పాటు విద్యార్థులు నష్టపోతున్నారని విమర్శించారు.

విద్యార్థిని హత్య.. నిందితులపై పోక్సో కేసు

- అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి శివరాంరెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా కేంద్రంలో విద్యార్థిని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులపై పోక్సో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు డిఎస్‌పి శివరాంరెడ్డి తెలిపారు. నల్లగొండ డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు సంబంధించిన వివరాలను డిఎస్‌పి వెల్లడించారు. నల్లగొండ పట్టణ సమీపంలోని జికె అన్నారం గ్రామానికి చెందిన నిందితుడు గడ్డం కృష్ణ.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల కింద 17 ఏండ్ల బాలికతో పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా చాట్ చేసేవాడు. ఈ నెల 7వ తేదీన ఉదయం ఎనిమిది గంటల సమయంలో బాలిక తన గ్రామం నుంచి కాలేజీకి ప్రతిరోజూ వెళ్లే ఆటోలో నల్లగొండకు వచ్చింది. గడ్డం కృష్ణ బైక్‌పై నల్లగొండకు వచ్చి ఆమెను కలిశాడు. అక్కడి నుంచి అతని స్నేహితుడు బచ్చలకూరి మధుకు చెందిన ఆటోలో షంషానగర్, రోడ్ నెంబర్ 8లో మధు కిరాయికి తీసుకున్న రూమ్‌కి తీసుకెళ్లాడు. అక్కడ కృష్ణ ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో బాలికకు తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోయింది. అది చూసి భయపడిన కృష్ణ.. వెంటనే రూమ్‌కు తాళం వేసి పారిపోయి తనకు తెలిసిన వ్యక్తికి సమాచారం ఇవ్వగా అతను పోలీసులకు తెలియజేశాడు. కృష్ణ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. మధును కూడా అదుపులోకి తీసుకొని పూర్తి విచారణ చేశారు. వారి వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై టుటౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. కేసును త్వరితగతిన ఛేదించిన టుటౌన్ సిఐ ఎస్ రాఘవరావు, వన్‌టౌన్ సిఐ ఎ రాజశేఖర్‌రెడ్డి, టుటౌన్ ఎస్‌ఐ వై సైదులును ఎస్‌పి శరత్ చంద్రపవార్ అభినందించారు.

13న సుద్దాల పురస్కారాల ప్రదానోత్సవం

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాటలకు ప్రాణమైన తల్లిదండ్రులకు ప్రణామంగా సుద్దాల జానకమ్మ హనుమంతు సాహితి, జానపద, నృత్య పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఈ నెల 13న సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళా నిలయంలో నిర్వహించనున్నట్టు ప్రముఖ సినీ గేయ రచయిత, సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దాల అశోక్ తేజ తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ రచయిత్రి ఓల్గాకు ప్రముఖ జానపద, సినీ గాయని మధుప్రియకు, ప్రముఖ నర్తకి లాలినిధికి పురస్కారాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి సునంద, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రఘు, సుద్దాల సుధాకర్ తేజ తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. సభ ప్రారంభానికి ముందు నాట్య ప్రదర్శనలు, నృత్య రూపకాలు, చైతన్య కార్యక్రమాలు కూడా ఉంటాయని చెప్పారు. తెలంగాణ నేల సాలువాపై పాటలతో విత్తనమైన తన తల్లిదండ్రులు జానకమ్మ-హనుమంతు అని అన్నారు. నాన్న పేరుతో 13 సంవత్సరాలుగా ఇచ్చిన పురస్కారాన్ని, ఈసారి అమ్మ పేరుతో మూడు విభాగాల సాహితీ, జానపద, నృత్య విభాగాల్లో అందజేస్తున్నానని తెలిపారు. పోరాట పాటలకు తన తల్లిదండ్రులు తేనెటీప నద్ది, ప్రజల గొంతుకగా మారారని అన్నారు.

వారి స్ఫూర్తితోనే ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ప్రతిజ్ఞగా కొనసాగిస్తానని, పల్లెపల్లెనా సుద్దాల ఆశయాలను ముందుకు తీసుకువెళ్తానని చెప్పారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుద్దాల హనుమంతు పాటలు ఉద్యమాలకు స్ఫూర్తి అని, గరీబోడు గాయపడితే గండదీపమై వెలిగే జ్వాల అని అన్నారు. వారి కుటుంబం తెలంగాణ సాంస్కృతిక యుద్ధానికి ప్రతీక అని చెప్పారు. జానకమ్మ-హనుమంతుల గానం ప్రజల మస్తిష్కాలను విప్లవ భావాలతో నింపిందని గుర్తు చేశారు. సుద్దాల వంటి యుద్ధకవులను బతికించుకోవాలన్నారు. ఈ ప్రతిభా పురస్కారాలు సుద్దాల గానం నిరంతర ప్రవాహమని అన్నారు. సాహితీ, జానపద, నృత్య ప్రతిభా పురస్కార సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుద్దాల సుధాకర్ తేజ, సుద్దాల నిర్మల, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు
- రాజకీయ పార్టీల 1,620 పోస్టర్లు, వాల్ రైటింగ్, బ్యానర్ల తొలగింపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక నేపథ్యంలో ఎన్నికల అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి)ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. హైదరాబాద్ రెవెన్యూ డివిజన్లలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పలు ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేశాయి. ఎవరైనా భారీ ఎత్తున నగదు, విలువైన వస్తువులను తీసుకెళ్తున్నారా అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

అనుమతులు లేని ప్రకటనల తొలగింపు

అనుమతులు లేని ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లను ఎన్నికల అధికారులు తొలగించారు. ఇప్పటికే 1,620 రాజకీయ పార్టీల పోస్టర్స్, వాల్ రైటింగ్, బ్యానర్స్ గుర్తించగా వీటిలో 1,097 ప్రభుత్వ ఆస్తులు, 523 వ్యక్తిగత ఆస్తులు ఉన్నాయని అధికారులు గుర్తించారు. 1950 ఎలక్షన్ హెల్ప్‌లైన్, సి-విజిల్ మొబైల్ యాప్ ద్వారా 24/7 ఫిర్యాదులను పర్యవేక్షించనున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను నియోజకవర్గ వ్యాప్తంగా రంగంలోకి దించారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేయనున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉపఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్ని చర్యలను తీసుకుంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను రాజకీయ పార్టీలు, ప్రతినిధులు తప్పక పాటించాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేవిధంగా అందరి సహాయ సహకారాలను అందించాలని సూచించారు. ఎవరైనా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలకు పాల్పడితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'టీ- ఫైబర్' పైలట్ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని తగ్గించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, అందుకనుగుణంగానే పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అధ్యక్షతన జరిగిన 'స్టేట్ గవర్నమెంట్ ఐటీ మినిస్టర్స్ అండ్ ఐటి సెక్రటరీస్ రౌండ్ టేబుల్' సదస్సులో ఆయన తెలంగాణ ఐటీ గ్రోత్‌ను వివరించారు. "భావితరాల కోసం పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. అధునిక సాంకేతిక ఫలాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్న చివరి వ్యక్తి వరకూ చేరాలన్నదే మా లక్ష్యం. టీ-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు తక్కువ ఖర్చుతో హై-స్పీడ్ కనెక్టివిటీని అందించేందుకు కృషి చేస్తున్నాం. డిజిటల్ ఇండియా, భారత్ నెట్ లక్ష్యాలకనుగుణంగా ఫైబర్-టు-ది-హోమ్ నెట్‌వర్క్ ద్వారా ఈ-గవర్నెన్స్, విద్య, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ వ్యవస్థాపకత తదితర సేవలను ప్రజల ముంగిటకే సమర్థవంతంగా చేర్చుతున్నాం' అని చెప్పారు. 'భారత్ నెట్' అమల్లో వేగం పెంచాలనీ, రైట్ ఆఫ్ వే సవాళ్లను పరిష్కరించాలని, డిజిటల్ ఆస్తులను పరిరక్షించేందుకు సైబర్ భద్రత ఫ్రేమ్ వర్క్‌లను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కేంద్రాన్ని కోరారు. ఈ అంశాల్లో రాజకీయాలకు అతీతంగా కేంద్రంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టీ-ఫైబర్ ఎండి వేణు ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోరాటాలకు సన్నద్ధం కావాలి

- భవన నిర్మాణ రంగ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం
- దీన్ని కార్మికులందరూ ప్రశ్నించాలి : ఎం సాయిబాబు
- తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర నాలుగో మహాసభ ప్రారంభం
- జెండా ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామ్మోహన్



మహాసభలో మాట్లాడుతున్న ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవన, ఇతర నిర్మాణ కార్మికులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ఎం సాయి బాబు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (కూకట్ల శంకర్ నగర్)లోని జిటి గోపాల్‌రావు ప్రాంగణంలో తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (బిసిడబ్ల్యుఎఫ్-సిఐటియు అనుబంధం) రాష్ట్ర నాలుగో మహాసభ ప్రారంభమయ్యింది. ప్రారంభసూచకంగా ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో సాయిబాబు మాట్లాడుతూ తెలంగాణలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. రూ.346 కోట్ల రూపాయలను బోర్డు నుంచి ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎలా బదిలీ చేస్తారు? ఇన్సూరెన్స్ కంపెనీలను బతికించేందుకు కార్మికులకు అన్యాయం చేస్తారా? దీనిపై కార్మిక శాఖ అధికారులను కార్మికులందరూ నిలదీయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో తమ డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ప్రధాని మోడీ, బిజెపి నేతలు ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, ఒడిశా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్లు ఉన్నా అభివృద్ధి ఎందుకు జరగడం లేదు? ఆ రాష్ట్రాల నుంచి కార్మికులు ఇక్కడకు వలసెందుకు వస్తున్నారు? జీతాలు తగ్గించుకుని పనిచేయాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. వలస కార్మికుల హక్కుల కోసం కూడా తమ ఫెడరేషన కొట్లాడుతుందని తెలిపారు. దేశంలోని పది శాతం మంది కార్పొరేట్ల వద్ద 80 శాతం సంపద పోగుకావడం, మరోవైపు పేదల కొనుగోలు శక్తి రోజురోజుకీ పడిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సిగాచీ పరిశ్రమలో 54 మంది కార్మికులు చనిపోతే నేటికీ న్యాయబద్ధంగా దక్కాల్సిన పరిహారం రాకపోవడమేంటి? పరిహారం కోసం కార్మిక శాఖ వద్ద ధర్నాలు చేయాల్సి రావడమేంటి? అని వాపోయారు. కార్మికులు తమ హక్కుల కోసం అడుగడుగునా ప్రశ్నిస్తేనే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లో కార్మికవర్గ పోరాటాలు వేగంగా విస్తరిస్తున్న తీరును ఆయా దేశాల వారీగా వివరించారు. చైనా, భారత్‌లపై అమెరికా ఆంక్షలు, రష్యా-చైనా-ఇండియా స్నేహ బంధం బలపడడం వంటి పరిణామాలు ప్రపంచ రాజకీయ సమీకరణాలను మార్చుతున్నాయన్నారు. భారత ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గుతూ పాలస్తీనా విషయంలో మానవత్వాన్ని ప్రదర్శించలేదని విమర్శించారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు అమెరికా పెద్దన్న పాత్ర పోషిస్తున్నదనీ, ఆ వ్యవస్థనే ప్రపంచంలో ఎక్కడైనా ఉత్పత్తులు అమ్ముకోవచ్చునని చెప్పి ఇప్పుడేం అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై విపరీతమైన సుంకాలు వేస్తున్నదని విమర్శించారు. దీనిని బట్టే పెట్టుబడి దారీ వ్యవస్థ సరిగాదనే విషయం అర్థమవుతున్నదని చెప్పారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ మిత్రుల ప్రయోజనాల కోసం లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి సిద్ధమవుతోందని విమర్శించారు. ఆ కోడ్‌లు కార్మికులకు ఉరితాళ్లలాంటివన్నారు. వాటిని తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యపోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాస్, కోశాధికారి యల్క సోమయ్య గౌడ్, లక్ష్మీ నారాయణ, ఉప్పలయ్య, రవి, శ్రీనివాసులు, వెంకన్న, రాజు, కె. జంగయ్య, సోములు తదితర నాయకులు పాల్గొన్నారు.

.వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దు : మహాసభలో ఏకగ్రీవ తీర్మానం

-. వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగిస్తూ ఇచ్చిన జిఒ 12ను సవరించాలనే తీర్మానాన్ని ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు వంగూరు రాములు ప్రవేశ పెట్టారు. దాన్ని రాష్ట్ర కార్యదర్శి కె జంగయ్య బలపర్చారు. 'ప్రయివేటు బీమా కంపెనీలకు కట్టబెట్టిన రూ.346 కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలి. వెల్ఫేర్ బోర్డు నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలి. ప్రభుత్వమే సంక్షేమ పథకాలను అమలు చేయాలి. 1996 భవన నిర్మాణ కార్మిక కేంద్ర చట్టం నిబంధనల ప్రకారం రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు అడ్వజరీ కమిటీని నియమించాలి. ఆ కమిటీ నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులు ఖర్చు చేయాలి. వెల్ఫేర్ బోర్డు సలహా మండలిని తెలంగాణ ఏర్పడినప్పటి నుండి బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తమకు ఇష్టమొచ్చినట్లుగా నిధులను ఇతర శాఖలకు దారి మళ్ళిస్తున్నాయి. అలా చేయకూడదు. 2009 నుండి 2025 సెప్టెంబర్ వరకు వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు చేసుకున్న కార్మికుల సంఖ్య 27,35,693 కాగా ప్రస్తుతం బోర్డులో కార్డులు రెన్యూవల్ చేసుకొని అర్హత ఉన్న కార్మికుల సంఖ్య 15,14,606. ఇంకా 12,20,119 మంది కార్డులు రెన్యూవల్ కాలేదు. వాటిని రెన్యూవల్ చేయాలి' అని మహాసభ తీర్మానించింది.

రాష్ట్రంలో మరో రెండు దగ్గు మందులపై నిషేధం : డిసిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో రెండు దగ్గు మందులను నిషేధిస్తూ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిషేధం వెంటనే అమల్లోకి వస్తుందని డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీలైఫ్, రెస్పిఫ్రెష్-టిఆర్ మందుల్లో కల్తీ జరిగినట్టు గుర్తించారు. వీటిని విక్రయించొద్దంటూ ఆదేశించారు. వీటిని గుజరాత్‌కు చెందిన షేప్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్, రెడ్ నెక్స్ ఫార్మాస్యూటికల్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలు తయారు చేస్తున్నాయి. వీటి గడువు 2026 డిసెంబర్‌తో ముగియనున్నది. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మరణించినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో దానిపై దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే ఆ మందును తెలంగాణలో నిషేధించారు. తాజా మందుల నిషేధంతో రాష్ట్రంలో నిషేధించిన దగ్గు మందుల సంఖ్య మూడుకు చేరింది. చిన్నారుల మరణాలకు దారి తీస్తున్నట్టు ఆరోపణలున్న నిషేధిత మందులు విక్రయించకుండా క్షేత్రస్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవాలని షానవాజ్ ఖాసిం రాష్ట్రంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లను ఆదేశించారు. వెంటనే రిటైలర్లు, హోల్ సేలర్లు, పంపిణీదారులు, ఆస్పత్రుల్లో నిల్వ ఉంచిన నిషేధిత మందులకు సంబంధించిన వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో వీటిని పంపిణీ చేయకుండా, అమ్మకాలు జరపకుండా నిరోధించాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఎక్కడైనా ఈ మందులకు సంబంధించిన విక్రయాలు, ఇతర వ్యవహారాలు జరిగినట్టు అనుమానం వస్తే ప్రజలు పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 6969కు కాల్ చేసి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. బుధవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గతేడాది లాగానే ఈ ఏడాది కూడా ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రైతులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గతేడాది 75,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్న చరిత్ర ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తేవాలన్నారు. ధాన్యంలో తేమ ఎక్కువగా లేకుండా 17శాతం మించకుండా ఉండేలా చూసుకోవాలని, తాలు లేకుండా ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు 72 గంటల్లో చెల్లింపులు చేయనున్నట్టు తెలిపారు. జిల్లా రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 2 డ్రయ్యర్లను ఏర్పాటు చేయగా, అందులో ఒకటి తిప్పర్తి సెంటర్‌కు ఇచ్చినట్టు చెప్పారు. రైతులు దాన్ని వినియోగించుకొని తేమశాతాన్ని తగ్గించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డిఆర్‌డిఎ పిడి శేఖర్ రెడ్డి, ఆర్‌డిఒ అశోక్ రెడ్డి, సొసైటీ చైర్మన్ శాసన సంపత్ రెడ్డి, సిఇఒ బిక్షమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకుర్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

కరీంనగర్‌కు విస్తరించిన బర్గర్ కింగ్


కరీంనగర్ : దేశంలోని ప్రముఖ క్విక్ సర్వీస్ రెస్టారెంట్ చెయిన్‌లలో ఒకటైన బర్గర్ కింగ్ ఇండియా తన కార్యకలాపాలను కరీంనగర్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. ఈ నగరంలో తమ తొలి రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసినట్లు బర్గర్ కింగ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కపిల్ గ్రోవర్ తెలిపారు. ఈ కొత్త రెస్టారెంట్‌లో అతిథులు బర్గర్ కింగ్ ప్రసిద్ధ వూప్పర్ డీలక్స్ శ్రేణిని ఆస్వాదించ వచ్చన్నారు. రూ.79కే 2 వెజ్ బర్గర్లు, రూ.99కే 2 చికెన్ బర్గర్లు లభిస్తాయని వెల్లడించారు.

హైదరాబాద్‌లో కోఫోర్జ్ అత్యాధునిక లైబ్రరీ ఏర్పాటు



హైదరాబాద్ : ప్రపంచ స్థాయి డిజిటల్ సేవలు, సొల్యూషన్‌లను అందించే కోఫోర్జ్ లిమిటెడ్ బుధవారం హైదరాబాద్‌లో అత్యాధునిక పబ్లిక్ లైబ్రరీని ప్రారంభించింది. సమగ్ర విద్య, సామాజిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో దీన్ని కొత్తగూడలోని ప్రణవ బిజినెస్ పార్క్‌లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. కార్పొరేట్ సామాజిక సేవ (సిఎస్ఆర్)లో భాగంగా నోయిడా, గూర్‌గావ్ తర్వాత ఇక్కడ మూడో లైబ్రరీని 15,000 పైగా పుస్తకాలతో అందుబాటులోకి తెచ్చామని కోఫోర్జ్ చీఫ్ బ్రాండ్ ఆఫీసర్ అనురాధా సేహగల్ పేర్కొన్నారు.

ఎస్ఇఎల్ ఎనర్జీకి గోల్డెన్ పికాక్ అవార్డు



హైదరాబాద్ : కార్పొరేట్ పాలనలో అత్యుత్తమ ప్రమాణాలకు గాను తమ సంస్థకు ప్రతిష్టాత్మక గోల్డెన్ పికాక్ అవార్డు దక్కిందని ఎస్ఎఇల్ ఎనర్జీ ఇండియా వెల్లడించింది. 2025 సంవత్సరానికి ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో విజేతగా నిలిచామని ఆ కంపెనీ సిఇఒ జనమేజయ మహా పాత్ర తెలిపారు. అత్యున్నత ప్రమాణాలను నిల బెట్టడానికి తమ సంస్థ నిబద్ధత, విశ్వసనీయత, పారదర్శకత, వాటాదారుల విలువ కోసం నిరంత రాయంగా కృషి చేయడానికి ఇది నిదర్శనమన్నారు.

పిడుగుపాటుకు విద్యార్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిడుగుపాటుకు విద్యార్థి మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నల్లవెల్లిలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లవెల్లి గ్రామానికి చెందిన జోగు యాదమ్మ, యాదయ్య దంపతుల కుమారుడు జోగు మనీష్ (13) ఏడవ తరగతి చదువుతున్నాడు. స్కూల్ ముగిసిన తర్వాత ఇంటికి వచ్చాడు. సాయంత్రం వేళల్లో ఇంటిదగ్గర ఉండగా మనీష్ ఒక్కసారిగా పిడుగుపాటుకు గురయ్యాడు. దాంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ముందు ఆడుకుంటున్న తన కొడుకు పిడుగు పాటుకు గురై మృతి చెందడంతో ఆ తల్లి దండ్రులు బోరున విలపించారు. నల్లవెల్లి గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

గురుకులాలను సమాధి చేస్తే సహించబోం

- కిరాయి కట్టకుండా రూ.2.5 లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?
- విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి కాంగ్రెస్‌పై సమరశంఖం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకులాలను సమాధి చేసేందుకు పన్నాగం చేస్తే సహించే ప్రసక్తే లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రెసిడెన్షియల్ వ్యవస్థను బలిపెడితే ఊరుకునేది లేదన్నారు. గురుకులాల అద్దె భవనాలకు ఏడాది కాలంగా కిరాయి కట్టని కాంగ్రెస్ సర్కారు అప్పు తెచ్చిన రూ.2.5 లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయని ఆయన ప్రశ్నించారు. తక్షణమే అద్దె బకాయిలు చెల్లించాలనీ, విద్యార్థులు నష్టపోకుండా చూడాలని, భవనాలకు తాళాలు వేయకుండా నిరోధించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కెటిఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

తెలంగాణ సంక్షేమ గురుకులాలకు అద్దె బకాయిలు పేరుకుపోయి, చివరికి భవనాలకు తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత దుర్మార్గమని కెటిఆర్ విమర్శించారు. గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనీ, దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత, చేతకానితనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న సిఎం రేవంత్ రెడ్డి అద్దె బకాయిలు చెల్లించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేయాలన్న కుట్రలో భాగంగానే సిఎం రేవంత్ ఇదంతా చేస్తున్నట్టు అనుమానం వ్యక్తం చేశారు. రెండేళ్లు నిండకుండానే రూ.2.5 లక్షల కోట్ల అప్పు చేసి కనీసం అద్దె భవనాల బకాయిలు చెల్లించలేదని తెలిపారు. గురుకులాలకు తాళం వేసే పరిస్థితి వస్తే నిరంకుశ కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



గుండెపోటుతో తరగతి గదిలోనే ఉపాధ్యాయురాలు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని యూపీఎస్ నంబర్-4 పాఠశాలలో బుధవారం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు ప్రకారం.. జహీరాబాద్‌లోని యుపిఎస్ నంబర్-4 పాఠశాల ఉపాధ్యాయురాలు బి.సుజాత (57) బుధవారం ఉదయం ప్రార్థన అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు తరగతి గదిలోకి వెళ్లింది. విద్యార్థులకు పాఠం బోధిస్తుండగా ఒక్కసారిగా నేలపై పడిపోవడంతో విద్యార్థులందరూ రోదిస్తూ తరగతి బయటికి పరుగులు తీశారు. దాంతో పక్కనే ఉన్న సహచర ఉపాధ్యాయులు, పాఠశాల హెచ్ఎం రాజ్ మార్, ఫరీదా రుక్సానా, మిగతా సిబ్బంది కలసి సిపిఆర్ నిర్వహించారు. వెనువెంటనే పాఠశాల బయట ఉన్న వాహనాన్ని తీసుకొని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండెపోటుకు గురై సుజాత మృతి చెందినట్టు ధ్రువీకరించారు. వైద్యశాలకు చేరుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం మతదేహాన్ని కోహిర్ మండలంలోని పైడి గుమ్మల్ గ్రామానికి తరలించి అక్కడ అంతక్రియలు నిర్వహించారు. కాగా, ఉపాధ్యాయురాలు సుజాత మృతితో పాఠశాలలో విద్యార్థులు మౌనం పాటించి ఆమె నివాళులు అర్పించారు.

12న ఆరు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల 12న ఆరు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఇతర దేశాల నుంచి మన దేశంలోకి రాకపోకలు జరుగుతున్న ముఖ్యమైన 290 జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. మన రాష్ట్రంలో కేంద్రం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ మొత్తం ఐదు జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్ ఉంటుంది. దీనికి తోడు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఆయా జిల్లాల్లో ఐదు సంవత్సరాలలోపు వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఆరు జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు కాగా, మన దేశంలో చివరి కేసు 2011లో నమోదైంది. గత మూడేండ్లుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో మన దేశంలో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్‌కు కేంద్ర ఆరోగ్యశాఖ పూనుకుంది.

గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలి

- గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ధర్నాలో కల్వకుంట కవిత


ధర్నాలో పాల్గొన్న కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయని, వెంటనే వాటిని రద్దు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ గన్ పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రూప్-1 అభ్యర్థులకు ధైర్యం ఇవ్వాలని ఈ ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలని జాగృతి ఆధ్వర్యంలో టిజిపిఎస్‌సి కార్యాలయాన్ని ముట్టడించినా ఇంతవరకు ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు, కుటుంబాలకు బోనస్ ఉద్యోగాలు ఇచ్చుకోండి కానీ బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని అన్నారు. రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చి నిరుద్యోగుల కాళ్లు పట్టుకుని ఓట్లు అడిగారని, ఆయన నేడు నిరుద్యోగులనే మోసం చేశారని ఆరోపించారు. ఇంత వరకు జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. పాత ఉద్యోగాలు ఇచ్చి, ఉద్యోగాలు తామే ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రూప్-1 పరీక్ష రద్దయ్యేంత వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంలో తెలంగాణలోని మేధావులు మౌనం వీడాలని కోరారు. అవసరమైతే ప్రొ.హరగోపాల్‌ను కలిసి గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు ఆయనతో కలిసి పోరాటం, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులే కూలగొడతారని హెచ్చరించారు. వెంటనే గ్రూప్-1 నియామకాలు రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాలని, ప్రెసిడెంటల్ ఆర్డర్ ద్వారా ఎనిమిది మంది ఎపి వారికి ఉద్యోగాలు ఇచ్చారని, ప్రెసిడెంటల్ ఆర్డర్‌పై తాము ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలు, గ్రూప్-1 అభ్యర్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉద్యమ కళాకారులకు అండగా ఉంటాం : కవిత

తెలంగాణ జానపద, ఉద్యమ కళాకారులకు అండగా నిలుస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. బుధవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జానపద, ఉద్యమ కళాకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ వారసత్వ జానపద కళారూపాలను రేపటి తరాలకు అందిస్తున్న కళాకారులు దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగించడం విచారకరమన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒగ్గు డోలు, కోలాటం, బుర్రకథ, ఒగ్గు కథ, చిందు యక్షగానం, బంజారా కడ్డి తంత్రి, కూన పులిపటం, శారద కథలు, హరికథ, గోండి, తోటి, ఆదివాసీ, కిన్నెర తదితర జానపద కళారూపాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. జానపద కళల పరిరక్షణకు ప్రత్యేక పాలసీ రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద సకల కలల పరిరక్షణ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు మురళీధర్ దేశ్ పాండే, వందలాది మంది కళాకారులు పాల్గొన్నారు.



'సామాజిక సంస్కరణల ఉద్యమ శీలి రఘుపతి వెంకటరత్నం నాయుడు'

ప్రజాశక్తి - కల్చరల్

సమాజంలో పలు ఆంధ విశ్వాసాలు మూఢ నమ్మకాలు ప్రబలివున్న కాలంలో ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా కృషి చేసిన తెలుగు వారు కందుకూరి వీరేశలింగం రఘుపతి వెంకటరత్నం నాయుడు అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు రఘుపతి వెంకటరత్నం నాయుడు బ్రహ్మ సమాజం ద్వారా కుల మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక సంస్కరణల ఉద్యమ శీలి అని పేర్కొన్నారు శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా రఘుపతి వెంకటరత్నం నాయుడు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ పాల్గొని మాట్లాడుతూ గొప్ప విద్యా వేత్త వెంకట రత్నం నాయుడు తాను ఉపన్యాసకుని పనిచేస్తున్న విద్యా లయంలో స్త్రీలకు ప్రవేశం కల్పించి సహ విద్యను ప్రోత్సహించి బ్రిటిష్ ప్రభుత్వంచే నైట్ హుడ్ బిరుదు అందుకున్నారని చెప్పారు. స్వతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని జైలు శిక్ష అనుభవించారని వివరించారు ప్రజలు ఆయనను బ్రహ్మర్షిగా పిలిచే వారని, ఇందుకు కారణం బౌద్ధ మతంలో దయ గుణం, క్రైస్తవ మతంలో సేవా గుణంతో కలిసి ఆయన జీవించడమని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై రచయిత్రి శైలజ మిత్ర గాయకుడు రామోజీ గాన సభ పాలక మండలి సభ్యులు గీతా దేవి పాల్గొన్నారు.


భేటీ అయిన మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం, అడ్లూరి

మంత్రుల మధ్య సయోధ్య కుదిర్చిన టిపిసిసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రుల మధ్య సయోధ్య కుదిరింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేశారనే వచ్చిన వివాదం నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ హైదరాబాదలోని తన నివాసంలో ఆ ఇద్దరు మంత్రులతో భేటీ అయ్యారు. సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, శివసేన రెడ్డి, సంపత్ కుమార్, అనిల్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ జోక్యంతో మంత్రుల మధ్య వివాదం సద్దుమణిగింది.

సమావేశంలో పొన్నం ప్రభాకర్ తాను అనుచితంగా చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను అనకపోయినా పత్రికల్లో వచ్చిన దానికి తన సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధపడినందుకు క్షమాపణలు కోరారు. తనకు అలాంటి ఆలోచన లేదని, తాను ఆ ఒరవడిలో పెరగలేదన్నారు. కరీంనగర్‌లో తామంతా మాదిక సామాజిక వర్గంతో కలిసి పెరిగినట్టు తెలిపారు. అలాంటి అపోహలు పెట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అనీ, ఆ పార్టీలో పుట్టి పెరిగిన తనకు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు పార్టీ సంక్షేమం తప్ప ఎటువంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తమకు అలాంటి సంస్కృతి నేర్పలేదన్నారు. ఇది సామాజిక న్యాయం కోసం పోరాడే సందర్భమని గుర్తుచేశారు.



సభలో మాట్లాడుతున్న వెంకట్రాములు

సంక్షేమంలో కాంగ్రెస్ విఫలం

- వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న రూ.12 వేలు వెంటనే చెల్లించాలి : ఆర్ వెంకట్రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు అన్నారు. భూమి లేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని మోసం చేశారని విమర్శించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో వ్యకాస జిల్లా అధ్యక్షులు జగన్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత లోపిస్తుందని అన్నారు. ఇళ్లు లేని ప్రతి పేదోడికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేని వారికి ప్రభుత్వ జాగాలో ఇంటి కోసం 120 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద పేదల ఇళ్ల కోసం రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులకు రెండు, మూడు నెలలైనా కూలీ డబ్బులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి రేట్లు రూ.600కు పెంచాలని, ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్, ఉపాధ్యక్షులు హన్మంతు, ఎం.రాములు, సహాయ కార్యదర్శి పాండు, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ శివలీల, నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



కాగ్నిజెంట్‌లో మార్టిన్ ఆరాంకో ఫార్ములా వన్ టీం సందడి

హైదరాబాద్ : కాగ్నిజెంట్ హైదరాబాద్ క్యాంపస్‌ను ఆస్టన్ మార్టిన్ అరాంకో ఫార్ములా వన్ రేసర్ లాన్స్ స్ట్రోల్ సందర్శించారు. రోజంతా జరిగిన కార్యక్రమాల్లో లాన్స్, పెడ్రో కాగ్నిజెంట్ బృందంతో మమేకమయ్యారు. వారు కాగ్నిజెంట్ డిజిటల్ నైపుణ్యం, ఇన్నోవేషన్‌ను ముందుకు తీసుకెళ్తుందో అడిగి తెలుసుకున్నారు. కాగ్నిజెంట్ సాంకేతికత, సేవల గురించి ప్రత్యక్షంగా వినడం విలువైన అనుభవమని లాన్స్ స్ట్రోల్ పేర్కొన్నారు. 'లాన్స్‌తో గడపడం దయ సహచరులకు గర్వకారణమని కాగ్నిజెంట్ ఇండియా సిఎండి రాజేష్ వారియర్ పేర్కొన్నారు.